పేదల సంక్షేమానికే ప్రాధాన్యం

ఎమ్మెల్యే రక్షణనిధి


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. తిరువూరు 16, 17 వార్డులలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి అందిన వివిధ పథకాలను వివరించారు. సామాజిక అసమానతల తొలగింపు, పేదరిక నిర్మూలన కోసం లబ్ధిదారులకు నేరుగా నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేదలు చదువుకు దూరం కాకూడదని తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి నిధులు నేరుగా జమ చేస్తున్నారన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, 16, 17 వార్డు ఇన్‌చార్జిలు తిరుమలశెట్టి వేణుబాబు, షేక్ జాకీర్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు ప్రసాద్, సత్యానారాయణ, శేఖర్, స్థానిక నాయకులు శ్రీనాథ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

నూజివీడు: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రోఫ్ గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

గంపలగూడెం ఆర్‌ఐగా వీరభద్రం

గంపలగూడెం: గంపలగూడెం ఆర్‌ఐగా ఎం.వీరభద్రం గురువారం బాధ్యతలు తీసుకున్నారు. తిరువూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఆర్‌ఐగా, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన మోహనరావు తిరువూరు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

కోతుల పట్టివేత

చంద్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడెంలో పంచాయతీ అధికారులు కోతులను పట్టించి, దూరంగా అటవీ ప్రాంతంలో వదిలేశారు. కొంత కాలంగా చంద్రగూడెంలో కోతుల బెడదతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పంచాయతీ వారికి బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ బోలగాని శ్రీనివాసరావు స్పందించి పంచాయతీలో తీర్మానం చేయించి కోతుల పట్టివేతకు చర్యలు తీసుకున్నారు. కోతులు పట్టే వారిని ఏర్పాటు చేసి 110 కోతుల వరకు పట్టించి, అటవీ ప్రాంతంలో వదిలేశారు. కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శి కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆసరా, చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా



ఆగిరిపల్లి: ఆసరా, చేయూత పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా చేయూత డీపీఎం ఎస్.వెంకట రామోజీ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం ఆసరా, చేయూత లబ్ధిదారులతో మల్టీ నేషనల్ కంపెనీ (ఎంఎన్‌సీ) ప్రతినిధులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ చేయూత, ఆసరా పథకం కింద కిరాణా, టెక్స్‌టైల్స్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు రిలయన్స్, నెస్లే, ఎజియో, జియో కంపెనీలలో సరుకులు కావాల్సిన వారు ఇంటి వద్ద నుంచి ఫోన్ ద్వారా ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. ఏపీఎం బి.రామకృష్ణ, ఎంఎన్‌సీ ప్రతినిధులు, సీసీలు వెంకటరత్నం, లక్ష్మీ, అరుణకుమారి పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ 1వవార్డు రాజీవ్‌నగర్‌లో నూతన పైపులైన్ పనులు గురువారం ప్రారంభించారు. 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7.20 లక్షలతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరగా పైప్‌లైన్ నిర్మాణం పూర్తిచేసి, రాజీవ్‌నగర్ వాసులకు తాగునీటి వెతలు తీర్చుతామన్నారు. వార్డు కౌన్సిలర్ చంద్రం పాల్గొన్నారు. 14వ వార్డులో తుప్పు పట్టిన తాగునీటి కుళాయిల స్థానంలో నూతన ట్యాపులు ఆ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ, రవిబాబు ఏర్పాటు చేశారు.

ఏఏఎంటీఏ దర్బార్‌లో ఇఫ్తార్ విందు

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడులో ఉన్న ఏఏఎంటీ దర్బార్‌లో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి మాట్లాడుతూ దర్బార్లో మహనీయులు సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ఆశీస్సులతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఇన్సూరెన్స్ రూ.లక్ష అందజేత

లింగాల(గంపలగూడెం): గుళ్లపూడి పీఏసీఎస్ సభ్యులు లింగాలకు చెందిన పి.వెంకట నరసమ్మ ఇటీవల మృతి చెందగా మంజూరైన ఇన్సూరెన్స్ రూ. లక్షను గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కృష్ణా జిల్లా సహకార బ్యాంకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా మంజూరైన నగదును మృతురాలి కుమారుడు వెంకటేశ్వరరావుకు పీఏసీఎస్ అధ్యక్షుడు శశాంక్, గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు అందజేశారు.

లంక భూములకు పట్టాలు మంజూరు చేయండి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు లంక భూములు సాగుచేసుకుంటున్న వారికి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కలెక్టర్ ఢిల్లీరావును కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని లంక సాగుదారులు, నాయకులతో కలెక్టర్ ఢిల్లీరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. లంక భూములు సాగుచేసుకుంటున్న సొసైటీ సభ్యులకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ 799 ఇప్పటికే విడుదల చేసిందన్నారు. బ్రిటిష్ కాలం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గం వారు తరతరాలుగా జీవనోపాధిగా సాగు చేసుకుంటున్నట్లు గుర్తుచేశారు. లంకే అంకమోహనరావు, కౌన్సిలర్ ఎస్.లక్ష్మీ, నల్లమోతు దయాకర్, ప్రకాష్, రవి, మడుమల్లి ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో క్షయ నివారణ

డీఎంహెచ్‌ఓ సుహాసిని


క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

ఇబ్రహీంపట్నం: ప్రజల భాగస్వామ్యంతో క్షయ లేని సమాజం సాధ్యం అవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 32మంది క్షయ వాధిగ్రస్తులకు ఆమె గురువారం పోషకాహారం పంపిణీ చేశారు. జిల్లాలో క్షయ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా మందులు, పోష్టికాహారం ఆరు నెలలు తీసుకుంటే వ్యాధి తగ్గిపోతుందని చెప్పారు. ఇంటివద్దకే ఏఎన్‌ఎంలు, ఆశాలు మందులు అందజేస్తారన్నారు. దాతల సహకారంతో జిల్లా అంతటా పోషకాహారం అందిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్ భాగంగా 2025 నాటికి జిల్లాలో టీబీ నిర్మూలించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి తెలిపారు. డాక్టర్ సుదాప్రసూజా పాల్గొన్నారు.

భూసేకరణకు స్థలాలు పరిశీలించిన సబ్‌కలెక్టర్


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

నూజివీడు: నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణలో భాగంగా గుర్తించిన భూములను గురువారం సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ పరిశీలించారు. నూజివీడు పరిధిలో పోతురెడ్డిపల్లిరోడ్డులో బైపాస్ రోడ్డు మలుపు వద్ద, ముసునూరు మండలం కొర్లగుంట వద్ద రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదికను రెవెన్యూ శాఖకు పంపారు. దీంతో ఎక్కడెక్కడ ఎంతెంత విస్తీర్ణంలో భూములు సేకరించాలి, ఆయా యజమానుల అంగీకారం ఉందా, లేదా, భూముల ప్రభుత్వ ధర ఎంత ఉందనే వివరాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన భూసేకరణ పనులను పూర్తి చేయాలని తహసీల్దార్ డీవీఎస్ యల్లారావుకు సబ్‌కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌డీ డీఈ సీహెచ్ బాబూరావు, ఏఈ అశోక్‌బాబు, నూజివీడు సర్వేయర్ రవీంద్రనాథ్, ముసునూరు తహసీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

విస్సన్నపేట: విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి కృషి వలనే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. విస్సన్నపేటకు డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి మరువలేనిది, మండల,పట్టణ వైఎస్సార్‌సీపీ తరుపున ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు


ఇబ్రహీంపట్నంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్


చాట్రాయిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విశ్వనాథరావు

తిరువూరు: స్థానిక చీరాల సెంటర్లో తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్) ఆధ్వర్యంలో గురువారం తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే తిరువూరు పట్టణంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని వేసవిలో గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు దుక్కిపాటి మురళీకృష్ణ, పరసా నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, సోమశేఖర్, నాగమల్లేశ్వరరావు, నరేంద్ర, శారదారావు, స్వామి పాల్గొన్నారు. మండలంలోని ఎర్రమాడు, పెద్దవరంలో సర్పంచ్‌లు బొర్రా మాధవి, గద్దె అప్పారావు చలివేంద్రాలను ప్రారంభించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. సూర్యామెస్ సహకారంతో స్థానిక రింగ్‌సెంటర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రం కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీతో కలసి ఆయన గురువారం ప్రారంభించారు. చలివేంద్రం దాత మడుమల్లి ఆనంద్, నాయకులు ఎస్.శివశంకరరావు, లంకే అంకమోహనరావు, చిన్నయ్య పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. పర్వతాపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మిద్దే శివాజీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిద్దే బాలకృష్ణ పంచాయతీ కార్యదర్శి నిస్సాక్ అలీ పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, సర్పంచ్ మండల అరుణ గురువారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వేములకొండ సాంబశివరావు, ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, సెక్రెటరీ బసవలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రతలతో ప్రమాదాల నివారణ


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మైలవరం: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు జాగ్రతలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మైలవరం ఫైర్ స్టేషన్‌లో ఎన్టీఆర్ జిల్లా అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగింపు కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు, గ్రామ వలంటీర్లు, లయన్స్ క్లబ్ మెంబర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులతో అగ్నిమాపక వర్క్‌షాపు, సెమినార్ నిర్వహించారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులకు అగ్గిపెట్టెలు, లైటర్‌లు, క్రాకర్స్, ఎలక్ట్రికల్ సామగ్రి అందుబాటులో లేకుండా చూడాలని సూచించారు. పక్క మీద పడుకుని సిగరెట్ కాల్చడం, సిగరెట్లు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడేయడం చేయకూడదన్నారు. ప్రమాదం జరిగితే ఆర్పడానికి నీటిని ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నూజివీడు అగ్నిమాపక అధికారి కె.భాస్కర రామం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు పాటించాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట చేయడం పూర్తి కాగానే పుల్లల పొయ్యిలో నిప్పులను ఆర్పివేయడం, వంటగ్యాస్ సిలిండర్ వద్ద రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత


జూపూడిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ సునీత

జూపూడి(ఇబ్రహీంపట్నం): మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలు వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత అన్నారు. మండలంలోని జూపూడిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో దినసరి కూలీ రూ.257 ఉండేదని ఇప్పుడు రూ.272 చేశారన్నారు. కూలికి అనుగుణంగా పనులు చేసుకోవాలని సూచించారు. వేసవి వడదెబ్బలు దృష్టిలో ఉంచుకుని ఉదయం పూట పనులు చేసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బందితో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఎంపీడీఓ రమకృష్ణనాయక్, ఏపీఓ మాధవరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రత్నకుమార్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



చాట్రాయి: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ స్పష్టం చేశారు. స్థానిక హైస్కూల్లో బుధవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కనివిని ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, దుస్తులు, అమ్మ ఒడి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి గ్రేడ్‌లు సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర బాగుందని ఆయన అన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్


నూజివీడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పిల్లా చరణ్

నూజివీడు: పట్టణంతో పాటు నూజివీడు మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 20వ వార్డులో గురువారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు పిల్లా చరణ్ పాల్గొని ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేబత్తిన మున్నా, క్లోపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని గురువారం కొనసాగించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, గ్రామ పార్టీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇంటింటా ప్రచారం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ఏ.కొండూరు: మండలంలోని రేపూడిలో గురువారం ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక 2023–24 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేపూడిలో రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎం.బెంజిమెన్ మాట్లాడారు. వేసవిలో మూడో విడత పంటలు 30 రకాల విత్తనాలు నాటుకోవడంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల సత్యవేణి, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మీ, వైస్ సర్పంచ్ సీహెచ్ జాన్ కోటి, వైఎస్సార్ సీపీ నాయకులు బ్రహ్మనందరెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

• **23న గురుకులాల ప్రవేశ పరీక్ష**

నూజివీడు: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2020–24 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నూజివీడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీలక్ష్మి గురువారం చెప్పారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును తీసుకుని పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

• **12 మంది జూదరుల అరెస్టు**

ఆగిరిపల్లి: మండలంలోని ఎస్‌ఏ పేట, ఆగిరిపల్లి గ్రామాల్లో 12 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.చంటిబాబు గురువారం తెలిపారు. ఎస్.ఎ.పేట, ఆగిరిపల్లి గ్రామాల్లో పేకాట జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేశారు. ఈ దాడిలో ఎస్.ఎ.పేటలో ఐదుగురు, ఆగిరిపల్లిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,770ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

• **నేడు గడపగడపకు మన ప్రభుత్వం**

నూజివీడు: పాతరావిచర్లలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. ఎమ్మెల్యే ప్రతాప్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

• **కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపుదాం**

ముసునూరు: ప్రజావ్యతిరేక విధానాలతో పేదల నడ్డి విరుస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర నేతలు చలసాని వెంకట రామారావు, జమలయ్య పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచార భేరి కార్యక్రమాన్ని పార్టీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ నేతలు నిమ్మగడ్డ నరసింహ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

సి.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, అడ్వకేట్
డి.నెం. 26–20–15, 2వ ఫ్లోర్, స్వామి వీధి, గాంధీనగర్, విజయవాడ–3. సెల్: 9399975668

గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రెడ్డిగూడెం: మండలంలోని శ్రీరామపురం పేర్వంచ రోడ్డు నుంచి ఊర చెరువు మీదుగా రేగాటివాగు వెళ్లే గ్రావెల్ రోడ్డు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి గురువారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దిరెడ్డి జమలారెడ్డి, శ్రీరామపురం సర్పంచ్ అట్లూరి శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ సభ్యులు గద్దల మారయ్య, తమత్క తిరుపతిరావు, మట్టా చిన్నబాయి, మట్టా తిరుపతిరావు, కిలారి సురేష్, మాజీ సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

మైలవరం: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సీ) అనుసరించి 2022–23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని మండల విద్యాశాఖాధికారి పీ రత్నశ్యామ్‌బాబు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడత విద్యార్థుల దరఖాస్తు ప్రక్రియ మార్చి 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు జరిగిందన్నారు. సదరు దరఖాస్తులకు గాను అర్హత పొంది, మొదటి లాటరీ ద్వారా ఒక కిలోమీటరు సచివాలయం పరిధిలో ఎంపికైన 397 మంది విద్యార్థుల జాబితా వివరాలు, వారికి కేటాయించిన పాఠశాలల వివరాలను మండలాల వారిగా మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ఉప తనిఖీ అధికారికి పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ నెల 19 నుంచి 25వ తేదీ లోపు ఆయా పాఠశాలల్లో అడ్మిషనుల పొందవలసిందిగా మండల విద్యాశాఖాధికారి తెలిపారు.

ఘనంగా ఈఎల్‌ఎస్ వార్షికోత్సవం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈఎల్‌ఎస్(ఎలక్ట్రికల్ లోకో షెడ్) 42వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో కలిసి డీఆర్‌ఎం షివేంద్రమోహన్ 100వ ఎలక్ట్రికల్ 3–ఫేజ్ లోకో మోటీవ్‌ను గురువారం రాత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో ఏప్రిల్ 1981లో ఈఎల్‌ఎస్ స్థాపించారన్నారు. అప్పటి నుంచి నాలుగు దశాబ్దాల పాటు సాంప్రదాయ లోకో మోటీవ్‌ల నిర్వహణకే పరిమితమైన ఈఎల్‌ఎస్ 2021 ఏప్రిల్ నుంచి 3–ఫేజ్ లోకో మోటీవ్‌ల నిర్వహణను సమర్థవంతంగా చేపడుతుందని తెలిపారు. ఈఎల్‌ఎస్‌లో ఇప్పటి వరకు 264 లోకో మోటీవ్‌ల నిర్వహణను చేస్తుండగా అందులో 100 ఎలక్ట్రికల్ 3–ఫేజ్ లోకో మోటీవ్‌లు కాగా, 164 సాంప్రదాయ ఎలక్ట్రికల్ లోకో మోటీవ్‌లు ఉన్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈఎల్‌ఎస్‌లో సమర్థవంతంగా లోకోల నిర్వహణ బాధ్యతలు చేపట్టడంలో కృషి చేసిన సీనియర్ డీఈఈ సీహెచ్ దినేష్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.